Eenadu                                                    Dt. 20/01/12.

# 50వేల ఉద్యోగాలు..
# రూ.50వేల కోట్ల పెట్టుబడులు

- మెట్రో రైల్ పనులన్నీ పారదర్శకం
- మరింత డబ్బు కోసమే ఆందోళనలు
- మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి


మొక్కను నాటుతున్న మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్:** నగరంలో ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన మెట్రోరైల్ ద్వారా వచ్చే ఐదేళ్లలో 50వేల మందికి ఉద్యోగాలు, రూ.50వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఈ పనుల పురోగతిని ఆయన గురువారం విలేకరుల బృందానికి వివరించారు. ఉప్పల్‌లోని మెట్రో డిపో, బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌ల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రూ.20వేల కోట్ల నిర్మాణ వ్యయంతో పనులు చేపట్టామని, ఐదేళ్ల వ్యవధిలో కచ్చితంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 2014 చివరికి తొలి దశను నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. మెట్రోరైల్ ప్రాజెక్టు, ఏసీ కోచ్‌ల నమూనా దాదాపు సిద్ధమైందని, త్వరలో వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. రైళ్ల ట్రాక్, కోచ్‌ల డిజైన్లలో స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బొంబార్డియన్ కంపెనీ సహా మరో మూడు కంపెనీల డిజైన్లనూ పరిశీలిస్తున్నామని వివరించారు. ప్రాజెక్టు కోసం ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తయిందని, అయితే కొందరు మరింత ఎక్కువ డబ్బు కోసం ఆందోళనలు నిర్వహిస్తున్నారన్నారు. స్థలాలు కోల్పోతున్న యజమానులతో సహా అద్దెకున్న వారికి కూడా పునరావాస ప్యాకేజీని వర్తింపజేస్తున్నామని గుర్తు చేశారు. వారసత్వ కట్టడాలకు ఎలాంటి ఇబ్బందులు రాబోవని స్పష్టం చేశారు. కారిడార్ పూర్తయ్యాక ప్రస్తుతం క్యారేజ్‌వే కోసం ఉపయోగిస్తున్న 30 అడుగుల రోడ్డును సైకిల్ ట్రాక్, పాదచారుల కోసం వాకింగ్ ట్రాక్, గ్రీన్ కారిడార్ కోసం కేటాయించనున్నామని తెలిపారు. అధికారికంగా శంకుస్థాపన గురించి ముఖ్యమంత్రి త్వరలో ప్రకటిస్తారని చెప్పారు.

## బిట్స్ పిలానీ-హైదరాబాద్‌లో హరితవనం

బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో హరితవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మెట్రో రైల్ సహకారంతో ఐదు వేల మొక్కలను విద్యార్థులు, అధ్యాపకులు నాటారు. బిట్స్ పూర్వ విద్యార్థుల ఛైర్మన్, పారిశ్రామిక వేత్త రాజురెడ్డి, బిట్స్‌పిలానీ-హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ వి.ఎస్.రావులు పాల్గొన్నారు.

## డిపో పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

మెట్రో రైల్ కోచ్‌ల నిర్మాణం, ఇతర అంశాలకు సంబధించిన పనులను ఉప్పల్ ఎమ్మెల్యే రాజిరెడ్డి పరిశీలించారు. నాగోలు బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన గ్రీన్ కారిడార్‌లో మొక్కలు నాటారు. తమ భూములకు పరిహారం ఇంకా ప్రభుత్వం నుంచి రాకపోయినా మెట్రో రైల్ కోసం 735 ఎకరాలను స్వాధీనం చేశామని ఉప్పల్ భగాయత్ రైతు సంఘం అధ్యక్షుడు దుబ్బ నరసింహారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో మెట్రోరైల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.